సాక్షి అనకాపల్లి

సోమవారం । 15 । మే । 2023



అరచేతిలో తాళపత్ర నిధి

దశాబ్దాల చారిత్రక సంపద అందరికీ అందుబాటులోకి వచ్చింది. తాటాకులపై రాసిన జ్ఞాన సంపదను పరిరక్షించే బాధ్యతను ఏయూ నిర్వర్తించింది. 8లో



ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వేల్పుల వీధి గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. 8లో



బొర్రాకు పర్యాటకుల తాకిడి

అనంతగిరి : బొర్రాగుహలకు పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం గుహలను 2,200 మంది తిలకించారు.

న్యూస్‌రీల్

కిరండూల్ లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): భద్రతా కారణాల వల్ల కొత్తవలస–కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖలో సోమవారం రాత్రి బయల్దేరిన విశాఖపట్నం–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. ఈనెల 15న కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. విశాఖలో ఈనెల 14, 15వ తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్‌లో ఈనెల 15, 16వ తేదీల్లో బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలు దంతేవాడ నుంచి బయల్దేరుతుంది.

కూలిన భారీ వృక్షం



నాగులాపల్లి వినాయకుని గుడివద్ద కూలిన వృక్షం

మునగపాక: మండలంలోని నాగులాపల్లి వినాయకుని గుడివద్ద రోడ్డు పక్కనే ఉన్న భారీ వృక్షం ఆదివారం సాయంత్రం కూలింది.ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.అధికారులు వెంటనే స్పందించి చెట్టును తొలగించారు.

నేడు జీవీఎంసీ స్పందన

డాబాగార్డెన్స్(విశాఖపట్నం): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మానసిక ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రామిరెడ్డి



మహారాణిపేట(విశాఖ): ప్రభుత్వ మానసిక వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కారెడ్డి వెంకటరామిరెడ్డిని నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన సోమవారం ఉదయం 10 గంటలకు పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎస్.హరికృష్ణ వ్యవహరించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతానికి చెందిన డాక్టర్ వెంకటరామిరెడ్డి ఎంబీబీఎస్, ఎండీ ఆంధ్రా మెడికల్ కాలేజీలో పూర్తి చేశారు. 1998 నుంచి 2002 వరకు సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా, 2002 నుంచి 2005 వరకు పోస్టుగ్రాడ్యుయేట్‌గా, 2005 నుంచి 2011 వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 2011 నుంచి 2017 వరకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2017 నుంచి ప్రొఫెసర్‌గా, 2023 నుంచి సైకాలజీ విభాగాధిపతిగా పనిచేస్తున్నారు.

నేడు రాయ్‌పూర్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: సంబల్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న బ్రిడ్జి పునర్నిర్మాణ పనుల నిమిత్తం ట్రాఫిక్ కమ్ పవర్ బ్లాక్ తీసుకుంటున్నందున ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు, మరికొన్నింటి దారి మళ్లిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈనెల 15న విశాఖపట్నం–రాయ్‌పూర్–విశాఖపట్నం(08527/08528) పాసింజర్ స్పెషల్ ఇరువైపులా రద్దు చేసినట్టు చెప్పారు. ఆదివారం తిరుపతిలో బయల్దేరిన తిరుపతి–బిలాస్‌పూర్(17482) ఎక్స్‌ప్రెస్ వయా టిట్లాఘడ్, సంబల్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

కాలుష్య రహిత విశాఖే లక్ష్యం

బీచ్‌రోడ్డు: కాలుష్య రహిత నగరమే లక్ష్యంగా జీవీఎంసీ పని చేస్తోందని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ పేరుతో ఆదివారం బీచ్‌రోడ్డులో సైకిల్ ర్యాలీ జరిగింది. ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీని మేయర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిని మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్, ఇంధన వినియోగం తగ్గించడం, చెట్లు పెంచడం తదితర వాటిని అలవాటు చేసుకోవాలన్నారు. జీవీఎంసీ తరఫున సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. నగర వ్యాప్తంగా పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నట్లు వివరించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● భక్తి పరవశం..

జిల్లాలో హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, తమలపాకులు, సింధూరంతో అర్చనలు చేశారు. పలు ప్రాంతాల్లో శోభాయాత్రను శోభాయమానంగా నిర్వహించారు. జై హనుమాన్, జై శ్రీరామ్ నినాదాలతో గ్రామాలు హోరెత్తాయి.

– సాక్షి నెట్‌వర్క్



రావికమతంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర



బుచ్చెయ్యపేటలో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

● అమ్మ దర్శనం..



అమ్మ దర్శనం అమోఘం..నయనానందకరం.. దేదీప్యమానమైన ఆ రూపం చూసే వారిదే భాగ్యం. గవరపాలెం నూకాంబిక అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయంలో క్యూలైన్లు కిటకిటలాడాయి. కొంత మంది భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న చలువ పందిళ్లలో వంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బందారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీనుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. – అనకాపల్లి టౌన్

టికెట్ చెకింగ్‌పై త్రినేత్రం



రైళ్లలో టికెట్ చెకింగ్, (ఇన్‌సెట్) బాడీ కెమెరా

- రైల్వే బోర్డు వినూత్న ప్రయోగం
- టికెట్ కలెక్టర్లకు బాడీ కెమెరాలు
- పారదర్శకంగా తనిఖీలకు చర్యలు
- వాల్తేరు డివిజన్‌లో అమలుకు ప్రణాళికలు

సాక్షి, విశాఖపట్నం: రైళ్లలో హింసాత్మక చర్యలను నిరోధించే లక్ష్యంతో రైల్వే బోర్డు వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టింది. టికెట్ చెకింగ్ సమయంలో వస్తున్న ఆరోపణలు, ప్రయాణికులతో వాగ్వాదాలకు చెక్ చెప్పేలా టికెట్ కలెక్టర్లకు బాడీ కెమెరాలు ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే మధ్య రైల్వే జోన్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్ట్ అమలు చేస్తున్న నేపథ్యంలో.. మిగిలిన జోన్లకు విస్తరించేందుకు సమాలోచనలు చేస్తోంది. త్వరలోనే ఈస్ట్‌కోస్ట్ పరిధిలోని వాల్తేరు డివిజన్‌లో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది.

రైలు ప్రయాణంలో టికెట్ తనిఖీలు చేసే సమయంలో ప్రయాణికులతో సిబ్బందికి వాగ్వాదాలు తరచూ జరుగుతున్నాయి. ఇదే సమయంలో టికెట్ కలెక్టర్లపై ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. వెయిటింగ్ టికెట్ తనిఖీ చేసే సమయం, ఆర్‌ఏసీ ఉన్న ప్రయాణికులకు బెర్త్‌లు కేటాయించే విషయంలోనూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వీటికి పూర్తిస్థాయిలో చెక్ చెప్పాలని రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ తనిఖీ అధికారులకు బాడీ కెమెరాలు అమర్చుతోంది. పైలట్ ప్రాజెక్టుగా మూడు నెలల కిందట సెంట్రల్ రైల్వే పరిధిలో 50 మంది టికెట్ కలెక్టర్లకు బాడీ కెమెరాలు అమర్చింది. అప్పటి నుంచి ఒక్క ఫిర్యాదు గానీ, ప్రయాణికుల వాగ్వాద సంఘటనలు నమోదు కాలేదు. దీంతో మిగిలిన జోన్లలోనూ అమలు చేయాలని బోర్డు నిర్ణయించింది.

ఒక్కో కెమెరా రూ.9 వేలు..

రైల్వే నెట్‌వర్క్ పరిధిలోని అన్ని జోన్లకూ బాడీ కెమెరాలు అందించాలని రైల్వే మంత్రిత్వ శాఖ బోర్డుకు సూచించింది. ఈ నేపథ్యంలో ఈస్ట్‌కోస్ట్ జోన్ పరిధిలో బాడీ కెమెరాలు అందించనున్నారు. ఇందులో భాగంగా వాల్తేరు డివిజన్ పరిధిలో టీటీలకు వీటిని అమర్చనున్నారు. ఒక్కొక్కటి రూ.9,000తో కొనుగోలు చేసిన ఈ బాడీ కెమెరాలు దాదాపు 20 గంటల ఫుటేజీని రికార్డు చేయగలవు. బాడీ కెమెరాలు టికెట్ తనిఖీ సమయంలో ఉద్యోగుల పారదర్శకతను కాపాడుకోవడంలో సహాయపడతాయి. దీంతో పాటు అక్రమ చర్యలను నిరోధించవచ్చు. ఫిర్యాదుల సందర్భంలో, టిక్కెట్ తనిఖీ సమయంలో ఏదైనా వ్యత్యాసాన్ని గుర్తించడంలో కీలక పాత్ర పోషించనున్నాయని వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు చెబుతున్నారు. వృత్తి నైపుణ్యం పెంచడంతో పాటు సిబ్బంది రక్షణకు దోహదపడతాయని అభిప్రాయపడుతున్నారు.

వేట నిషేధ వేళ భరోసా

- రేపు మత్స్యకార భరోసా విడుదల
- జిల్లాలో 11,373 మంది లబ్ధిదారులు
- ఈ ఏడాది పెరిగిన అర్హుల సంఖ్య



సముద్రం ఒడ్డున లంగర్ వేసిన బోట్లు

అచ్యుతాపురం(అనకాపల్లి): నడిసంద్రంలో బతుకు పోరాటం చేసే మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో పరిహారం అందజేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. మత్స్యకార భరోసా కింద వేట నిషేధ భృతిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది.

11,373 మందికి లబ్ధి

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 16న మత్స్యకార భరోసాను విడుదల చేయనున్నారు. జిల్లాలో ఈ ఏడాది 11,373 మందికి రూ.10 వేల చొప్పున భృతిని అందించనున్నారు. గత ఏడాది 10,244 మందికి అందజేశారు. గత నెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి సముద్ర తీరప్రాంత మత్స్యకారులు వేటను నిలిపివేశారు. ముఖ్యంగా మెకనైజ్డ్ బోట్లను ఒడ్డునే లంగరు వేశారు. ఈ రెండు నెలల కాలంలో చేపలు సముద్రంలో గుడ్లను పెడతాయి. ఈ సమయంలో వేట చేస్తే వాటి సంతానోత్పత్తి ఆగిపోతుంది.దీనివల్ల మత్స్యసంపద తగ్గిపోతుంది. ఈ కారణంగాజూన్15వరకూ సంద్రంలో వేటకు వెళ్లరు.

జిల్లాలో మత్స్యకార భరోసాకు అర్హులైన వారి సంఖ్య మండలాల వారీగా

మండలం	లబ్ధిదారుల సంఖ్య
పరవాడ	868
అచ్యుతాపురం	1,825
రాంబిల్లి	1,306
ఎస్.రాయవరం	2,478
నక్కపల్లి	1,883
పాయకరావుపేట	3,013

12 వేల మత్స్యకార కుటుంబాలు

జిల్లా పరిధిలో 73 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. ఈ తీరంలో ఆరు మండలాల పరిధిలోని 31 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. 12 వేల మత్స్యకార కుటుంబాలు చేపల వేట, విక్రయంపైనే ఆధారపడి ఉన్నాయి. జిల్లా నుంచి 44 వేల టన్నుల మత్స్య సంపదను దేశంలో పలు ప్రాంతాలకు, విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. దశల వారీగా జరిగే ఈ ప్రక్రియలో నిత్యం సముద్రంలో ఉండే గంగపుత్రులకు అనేక సాధక బాధకాలు ఉన్నప్పటికీ వారసత్వంగా వస్తున్న ఈ వృత్తిని కొనసాగిస్తున్నారు.

జిల్లా నుంచి ఎగుమతి

ఇటీవల కాలంలో చేపలకు డిమాండ్ పెరిగిందని మత్స్యకారులు తెలిపారు. రుచిగా ఉండడంతో పాటు, ఆరోగ్యానికి మేలు చేస్తుండడంతో చేపలను ఎక్కువగా ఆహారంలో తీసుకుంటున్నారని వారు చెప్పారు. సందువా, ట్యూనా వంటి చేపలను మధ్య వర్తులు జిల్లా నుంచి సేకరించి, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. చెన్నై, కొచ్చిన్, ముంబై వంటి ప్రాంతాలకు కూడా జిల్లాలోని మత్స్యకారులు సరఫరా చేస్తున్నారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

వేట నిషేధ సమయంలో మత్స్యకారుల భృతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోంది. పరిహారం నేరుగా మత్స్యకారుల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తోంది. జిల్లాలో 12 వేల మత్స్యకార కుటుంబాలు ఉండగా ఇంటికి ఒకరు చొప్పున లబ్ధిదారులను గుర్తించారు.

నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ

గత నెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి మత్స్యకారులు వేట నిలిపివేశారు. మళ్లీ జూన్ 15 నుంచి మొదలుపెట్టాలి. వేట నిషేధ సమయంలో పరిహారం అందిస్తాం. ఈ ఏడాది 11,373 మంది మత్స్యకారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు నేరుగా జమ అవుతుంది. గత ఏడాది 10,244 మందికి మత్స్యకార భరోసా అందజేశాం.

–లక్ష్మణరావు, జేడీ, మత్స్య శాఖ



అనకాపల్లి పట్టణంలో లారీని ఢీకొన్న కారు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

అనకాపల్లి, రావికమతం మండలాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, పదిమంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు. 8లో

ప్రకృతికి ప్రణామం

పంటల సాగులో జిల్లాలోని పలువురు రైతులు ప్రత్యేకత చూపుతున్నారు. రసాయన ఎరువులకు చాలా దూరంగా ఉంటున్నారు. ప్రకృతి పద్ధతిలో.. జీవ ఎరువులు ఎంతో మేలంటున్నారు.. అధిక దిగుబడులు సాధించేలా మెలకువలు, శాస్త్రవేత్తల సలహాలు పాటించి.. సాగులో భళా అనిపిస్తున్నారు. జిల్లాలో చాలా మంది రైతులు ప్రకృతికి ప్రణామం అంటున్నారు.

- ప్రకృతి సేద్యంపై రైతుల ఆసక్తి
- జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 30,374 మంది
- ఈ ఏడాది 23,590 ఎకరాల్లో సాగుకు సన్నద్ధం
- 225 గ్రామ సంఘాలకు అవగాహన సదస్సులు



చింతలూరులో ప్రకృతి వ్యవసాయంతో సాగు చేస్తున్న వరి పంట



ముకుందపురంలో కషాయాలు తయారు చేస్తున్న మహిళా రైతులు

మాడుగుల: అధిక దిగుబడి మీద ఆశ.. కనీసం పెట్టిన పెట్టుబడి అయినా చేతికి వస్తుందన్న ఆలోచనతో రైతులు రసాయన ఎరువులతో సాగుకు అలవాటుపడ్డారు. దీనిని మార్చాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ పథకం(ఏపీసీఎన్ఎఫ్) అమలు చేస్తోంది. ప్రకృతి వ్యవసాయంపై ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అవగాహన కల్పించడంతో జిల్లాలో ప్రస్తుతం 30,374 ఎకరాలకు ప్రకృతి సేద్యం పెరిగింది. గత 40 ఏళ్లుగా రసాయన ఎరువుల వినియోగంతో నిస్సారమైన భూములను తిరిగి సారవంతం చేసే దిశగా రైతులు చర్యలు ప్రారంభించారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ అందిస్తోంది. రైతులతో పాటు జిల్లాలో 6,528 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. చోడవరం, పాయకరావుపేట, యలమంచిలి, నర్సీపట్నం, అనకాపల్లి వ్యవసాయ డివిజన్ల పరిధిలో 225 గ్రామ సంఘాల సభ్యులకు అవగాహన తరగతులు నిర్వహించారు. దీంతో పలువురు రైతులు ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించారు. రానున్న ఖరీఫ్‌లో మరిన్ని ఎకరాల్లో ప్రకృతి సాగు చేపట్టేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఆర్‌వైఎస్‌ఎస్ ద్వారా గ్రామాల్లో ప్రస్తుతం మహిళా రైతులు ప్రకృతి సేద్యంపై ఆసక్తి చూపుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం ఇలా

- వేసవి దుక్కులు లోతుగా మొత్తగా దున్నకోవాలి. దీనివల్ల భూమి పొరల్లో ఉండే కలుపు మొక్కల విత్తనాలు, పంటలను నాశనం చేసే పురుగులు, చీమలు నశిస్తాయి. దీంతో కలుపు లేకుండా పంట ఏపుగా పెరుగుతుంది.
- ఎంపిక చేసుకున్న విత్తనాన్ని శుద్ధి చేయడం వల్ల నారుకు ఎటువంటి తెగుళ్ల సోకకుండా నిర్ణీత సమయానికి చేతికొస్తుంది.
- బీజామృతం వినియోగం వల్ల తెగుళ్ల సోకవు. 20 లీటర్ల నీటికి, 5 కిలోల ఆవుపేడ, 5 లీటర్ల ఆవు మూత్రం, 50 గ్రాముల సున్నాన్ని కలిపితే బీజామృతం తయారవుతుంది. దీనిలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి, బయటకు తీసి ఎండబెట్టి నారు మళ్లలో వేసుకోవడం వల్ల ఎటువంటి తెగుళ్ల సోకవు. నారు ఏపుగా ఎదుగుతుంది.
- దమ్ము చేసిన వెంటనే పచ్చి రొట్ట ఎరువులు వేసుకోవాలి. అనంతరం వరి నారు చిగుళ్లను తెంచి నాటితే తెగుళ్లు రాకుండా జాగ్రత పడవచ్చు. చేసు కొంత ఎదిగిన తర్వాత కాలి బాటలు చేసుకోవాలి. దీని వల్ల పంటకు గాలి వెలుతురు తగులుతాయి.
- ఎకరాకు పది చొప్పున పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఆకులపై చేరిన పురుగులను పక్షులు తింటాయి. తద్వారా పురుగులను నివారించవచ్చు. పొలాల గట్లపై ఎర్రపంటలు వేసుకోవాలి.
- డీఏపీకి బదులు ఘనజీవామృతం వినియోగించాలి. 100 కిలోల పేడ, 2 కిలోల శనగపిండి, రెండు కిలోల బెల్లం, పుట్టమట్టికి తగిన ఆవు మూత్రం కలిపి ఘనజీవామృతాన్ని తయారుచేసుకుని చేనులో వేసుకుంటే డీఏపీకంటే అధికంగా పని చేస్తుంది. సాగు వ్యయం తక్కువ, ఫలితం ఎక్కువగా వస్తుంది.
- పురుగులను నివారించేందుకు బ్రహ్మాస్త్రం తయారు చేసుకోవాలి. వేపాకు 3 కిలోలు, సీతాఫలం ఆకులు 2 కిలోలు, కరివేపాకు 2 కిలోలు, బొప్పాయి ఆకులు 2 కిలోలు, జామ ఆకులు 2 కిలోలు ముద్దగా చేసి ఆవు మూత్రంలో రెండు పొంగులు వచ్చే వరకు ఉడికించాలి. 24 గంటల తర్వాత ఆ ద్రావణాన్ని చేనుపై పిచికారీ చేసుకుంటే పంటలకు ఎటువంటి తెగుళ్లు ఆశించవని, అది పురుగుల పాలిట బ్రహ్మాస్త్రంగా పనిచేస్తుందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు.
- వరి ఉడుపుల తర్వాత పొలంలో అజోల్లా వేసుకుంటే కలుపు నివారించవచ్చు.

ఆరేళ్లుగా ప్రకృతి వ్యవసాయం



ఆరేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. వరి, రాగులు, మినుములు, కూరగాయలు పండిస్తున్నాను. రసాయన ఎరువుల వినియోగంతో భూమి సారం కోల్పోతుంది. కషాయాలతో ఘనజీవామృతం లాంటి ఎరువులు తయారు చేసుకుని, వాడడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు వస్తున్నాయి. మా గ్రామంలో 12 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు

– శ్రీనాదు గోవిందమ్మ, మహిళా రైతు, ముకుందపురం

లాభాలు బాగు



నేను నాలుగేళ్లుగా ప్రకృతి సేద్యం చేస్తున్నాను. ఆవుపేడ, ఆకులతో సొంతంగా ఎరువులు తయారు చేసుకుంటున్నాను. మొదట్లో ఎకరా పొలంలో సుమారు 10 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. తర్వాత 20 బస్తాల దిగుబడి వచ్చింది. మూడోసారి 28 బస్తాలు, నాలుగో సారి 30 బస్తాలు దిగుబడి సాధించాను. ఎకరాకు రూ.14 వేలు మాత్రమే పెట్టుబడి అవుతోంది. రసాయన ఎరువులతో వరి సాగు చేసేటప్పుడు ఎకరాకు 29 బస్తాల దిగుబడి వచ్చేది. కానీ రూ.30 వేలు ఖర్చయ్యేది. ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి తగ్గింది. దిగుబడులు బాగున్నాయి.

–శేనాపతి నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ రైతు. ఎం. కోడూరు.

తక్కువ ఖర్చుతో అధిక లాభాలు

సొంతంగా తయారు చేసుకున్న ఎరువులు, కషాయాలు వినియోగించడం వల్ల భూమి సారవంతంగా మారడంతో పాటు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యదాయకం. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయవలసిన అవసరం ఉంది. సాగు యాజమాన్య పద్ధతులు ప్రతి రైతుకు అధికారులు వివరిస్తున్నారు. పంట భూముల్లో 30 రకాల విత్తనాలు జల్లుకునే పద్ధతులు వివరిస్తున్నారు. రానున్న కాలంలో మరింతగా ప్రకృతి సేద్యం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

– సీహెచ్ లచ్చన్న, డీపీఎం

క్లుప్తంగా

ఎంపీ సత్యవతికి కృతజ్ఞతలు



ఎంపీ సత్యవతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లిటౌన్: మండలంలో సత్యనారాయణపురం రైల్వేబ్రిడ్జికి దిగువున సబ్‌వే నిర్మాణానికి ఎంపీ ద్వారా దక్షిణ మధ్య రైల్వే అధికారుల నుంచి అనుమతులొచ్చాయి. ఈ మేరకు సత్యనారాయణపురం, మూలపేట గ్రామస్తుల తరఫున వైఎస్సార్‌సీపీ నేతలు ఎంపీ సత్యవతిని తన కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మజ్జి అలివేలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పరిధిలో మానసిక వ్యాధులు

మహారాణిపేట: మానసిక వ్యాధులను కూడా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ పరిధిలోకి తీసుకొచ్చారు. మానసిక వ్యాధులను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చడంపై రోగుల బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మానసిక రోగులకు చికిత్స అందిస్తున్న ఏకైక ఆస్పత్రి నగరంలోనే ఉంది. 1860లో స్థాపించిన ఈ ఆస్పత్రి అంచెలంచెలుగా విస్తరించారు. 1950లో ఈ ఆస్పత్రిని ఆంధ్రా మెడికల్ కాలేజీకి అనుబంధంగా 300 పడకల బోధనాస్పత్రిగా తీర్చిదిద్దారు. ప్రతి రోజూ ఆస్పత్రికి 200 నుంచి 300 మంది వరకు రోగులు వస్తుంటారు. ఒడిశా, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి మానసిక రోగులకు ఇక్కడ సేవలందిస్తున్నారు.

అప్పు తీరలేదని విచారంతో ఇంటికి వెళ్తుండగా...

ఎండా వాననక ఆరుగాలం శ్రమించి పంట పండిస్తున్న గిరిజన రైతులకు రెక్కల కష్టమే మిగిలింది. చేసిన అప్పు తీరలేదని విచారంతో ఇంటికి పయనమైన వారు మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వారిలో ఒకరు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన రావికమతం మండలం జెడ్.కొత్తపట్నం వద్ద ఆదివారం చోటు చేసుకుంది.



చికిత్స పొందుతున్న లక్ష్మయ్య



చికిత్స పొందుతున్న రాజమ్మ



మృతుడు కర్రెన్న (ఫైల్)

- మార్గమధ్యంలో ఆటో బోల్తా
- గిరిజన రైతు మృతి
- మరో ఐదుగురికి గాయాలు
- జెడ్. కొత్తపట్నం వద్ద ఘటన

రావికమతం: కొత్తకోట నుంచి రొచ్చుపణుకు గ్రామం వెళ్తున్న ఆటో జెడ్. కొత్తపట్నం వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రొచ్చుపణుకు గ్రామానికి చెందిన పాటుకూరి కర్రెన్న మృతి చెందగా, మరో అయిదుగురికి గాయాలయ్యాయి. రొచ్చుపణుకు గ్రామానికి చెందిన కర్రెన్న కుటుంబం, తుర్రె లక్ష్మయ్య కుటుంబం నగదు వ్యవహారంలో తగవు పరిష్కారానికై కొత్తకోట పోలీసు స్టేషన్‌కు ఆదివారం వచ్చారు. నర్సీపట్నం వ్యాపారి శ్రీనివాస్ వద్ద కొన్నేళ్లుగా ఉన్న నగదు సమస్య పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని చెబుతూ, వ్యాపారి స్వాధీనంలో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను ఆ కుటుంబాలకు సీఐ అందించారు. స్టేషన్ నుంచి ఇంటికి వెళ్తుండగా జెడ్.కొత్తపట్నం గ్రామం వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటో టైరు పేలిపోవడంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కట్టెల రాజమ్మ, పాటుకూరి కర్రెన్న, తుర్రె లక్ష్మయ్య, చంద్రమ్మ, సోముల దేముడమ్మ, ఉల్లి సింహాచలం అనే ఆరుగురు గిరిజనులకు గాయాలయ్యాయి. గాయాలపాలైన వీరిని తక్షణ చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించి కొత్తకోట ఎస్‌ఐ విభీషణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే చికిత్స పొందుతూ కర్రెన్న మృతి చెందాడని, మిగిలిన వారికి చికిత్స కొనసాగుతోందని కొత్తకోట ఎస్‌ఐ విభీషణరావు ఆదివారం తెలిపారు.

రూ.4 లక్షల అప్పునకు పదేళ్ల జీడి ఫలసాయం

పట్టాదారు పాసుపుస్తకాలు ష్యూరిటీగా తీసుకుని గిరిజనులకు వ్యవసాయ రుణాలిచ్చిన వ్యాపారికి, బాధితులకు కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మండలంలోని రొచ్చుపణుకు గ్రామానికి చెందిన ఆదివాసీ రైతులు పాటుకూరి గంగమ్మ, కర్రెన్న దంపతులు, ఉల్లి ఎర్రయ్య వ్యవసాయ అవసరాల నిమిత్తం నర్సీపట్నానికి చెందిన వ్యాపారి శ్రీనివాస్ వద్ద రూ.2 లక్షల చొప్పున గతంలో అప్పు తీసుకున్నారు. దానికి బదులుగా వారి నాలుగు ఎకరాల్లోని జీడి ఫలసాయాన్ని ఏటా అతడికి అమ్ముతున్నారు. ఎకరాకు ఏటా గరిష్టంగా రూ.20 వేల నుంచి రూ.30 వేలు ఫలసాయం వస్తోంది. ఆ విధంగా ఇప్పటికీ పదేళ్లుగా చెల్లిస్తున్నా బాకీ తీరలేదు. సరికదా ఇంకా రూ.7 లక్షలు ఉందంటూ సదరు వ్యాపారి ఆ రైతుల పాసుపుస్తకాలు తాకట్టు పెట్టుకోవడంతో స్థానిక గిరిజన పోరాట నాయకుడు పి.ఎస్. అజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో బాధిత రైతులను, సదరు వ్యాపారిని స్టేషన్‌లో కూర్చోబెట్టి సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ వ్యాపారి వద్ద నుంచి పాసుపుస్తకాలను తీసుకుని రైతులకు ఇచ్చేశారు. నగదు లావాదేవీలు సైతం ఇరువర్గాలు పెద్దల సమక్షంలో పరిష్కరించుకుంటామని హామీ తీసుకుని పంపించేశారు.



వ్యాపారికి, గిరిజనులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మహమ్మద్

ఇంటర్ విద్యార్థిని చదువుకు సీఐ సహకారం

నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ వరకూ చదివి ఆర్థిక ఇబ్బందులతో మధ్యలో చదువు మానేసిన గంగమ్మ, కర్రెన్న కుమార్తె రాజ్యలక్ష్మికి సీఐ మహమ్మద్ కౌన్సెలింగ్ ఇచ్చారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉందని ఆమెను ఒప్పించారు. ఇంటర్‌తో పాటు పై చదువులు చదివేందుకు తగిన సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం



కలశపూజలో అర్చకులు

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ ప్రథమ వార్షికోత్సం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. గౌరీపరమేశ్వరులకు పంచామృతాభిషేకం, 108 కలశాలతో కలశ పూజలు నిర్వహించారు. అమ్మవారి అభిషేకంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయం ముందు కోలాటప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. సోమవారం గౌరీపరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శీరంశెట్టి నర్సింగరావు, సహాయ కార్యదర్శి పనసా శ్రీకాంత్, కోశాధికారి వేల్పుల గణేష్, వీధి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

డాక్టర్ మురళీకృష్ణకు కన్నీటి వీడ్కోలు



డాక్టర్ మురళీకృష్ణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్



డాక్టర్ మురళీకృష్ణ మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

- మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే రమణమూర్తిరాజు నివాళి

మునగపాక: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డాక్టర్ మళ్ల మురళీకృష్ణ అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య ఆదివారం మునగపాకలో నిర్వహించారు. తొలుత అనకాపల్లి వంద పడకల ఆస్పత్రి నుంచి అతని మృతదేహాన్ని ఊరేగింపుగా గ్రామానికి తీసుకువచ్చారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ తదితరులు మురళీకృష్ణ మృతదేహానికి పూలమాలలతో నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. కడచూపు కోసం స్నేహితులతోపాటు పలు రాజకీయ పార్టీల నేతలు తరలివచ్చి అమర్‌రహే డాక్టర్ మురళీకృష్ణ అంటూ నినదించారు. సేవగరిడీలు, డప్పు వాయిద్యాలు, చిటికల భజన వంటి కార్యక్రమాల మధ్య ఇక్కడ భారీ మందుగుండు వెలిగించి ర్యాలీ చేశారు. స్థానిక శ్మశాన వాటికలో కుమారుడి పార్థివదేహానికి తండ్రి సంజీవరావు తలకొరివి పెట్టారు.

36 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్టు, కారు, స్కూటీ స్వాధీనం



పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

కొయ్యూరు : మన్యం నుంచి మైదాన ప్రాంతానికి ఇన్నోవా కారులో తరలిస్తున్న 36 కిలోల గంజాయిని కొయ్యూరు ఎస్‌ఐ రాజారావు ఆధ్వర్యంలో పిట్టచలం శివారున ఆదివారం పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలివి. ముందస్తు సమాచారం మేరకు పిట్టచలం సమీపంలో వాహనాల తనిఖీ చేపడుతుండగా మొదట స్కూటర్‌పై ఒకరు వెళ్తుండగా పట్టుకున్నారు. తరువాత వెనక వస్తున్న కారును తనిఖీ చేయగా దానిలో 36 కిలోల గంజాయి బయటపడింది. చిత్తూరు జిల్లా ములకచెరువు మండలం పెద్దిపాలేనికి చెందిన మేకల రామారావు, శ్రీనివాసరావును అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, ఒక కారు, స్కూటీని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకాసు

నర్సీపట్నం: కారుణ్య నియామకాలు త్వరితగతిన చేపట్టాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.టి. రామకాసు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రేడ్-1, 2 వారికి ఒకేసారి బదిలీలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరారు. సెలవు రోజుల్లో పని చేయాలని ఒత్తిడి చేయటం సరికాదన్నారు. రీసర్వే ఖర్చులకు సంబంధించి వీఆర్వోలకు రూ.50 వేలు చొప్పున చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. సమావేశంలో కార్యదర్శి అనంతరాఘవయ్య, అసోసియేట్ అధ్యక్షుడు కె.రాజునాయుడు, నర్సీపట్నం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొలువుదీరిన మోదమ్మ



మోదకొండమ్మతల్లి ఘటాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సాక్షి,పాడేరు : మన్యం ప్రజలు ప్రజల ఆరాధ్య దైవం, చల్లని తల్లి పాడేరు మోదకొండమ్మతల్లి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం వేకువజామునే ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు దంపతులతో పాటు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వర్తన పిన్నయ్యదొర, నవర కొండబాబు, తమర్బ ప్రసాద్‌నాయుడు తదితరులు సతకంపట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి కాలినడకన మోదకొండమ్మతల్లి ఆలయానికి ఎమ్మెల్యే దంపతులు, భక్తులు చేరుకుని పుజాసామగ్రి పంపిణీ చేశారు. ప్రభుత్వం తరఫున కలెక్టర్ సుమిత్‌కుమార్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం మోదకొండమ్మతల్లి మూలవిరాట్‌తో పాటు ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

సతకంపట్టు వద్ద..

మోదకొండమ్మతల్లి మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా పాదాలు, ఉత్సవ విగ్రహం, ఇతర ఘటాలను మెయిన్‌రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సతకంపట్టు మండపంలో కొలువుదీర్చారు. ఉత్సవాలు ప్రారంభంతో ఆదివారం ఉదయం నుంచి పాడేరు పట్టణంలో సందడి నెలకొంది. ఆలయంలో అమ్మవారికి కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇతర ఇత్తడి ఘటాలకు కుంకుమార్చన నిర్వహించారు.

విగ్రహాలను మోసేందుకు..

ఊరేగింపులో ఉత్సవ విగ్రహాన్ని ఎస్పీ తుహిన్‌సిన్హా, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ మోశారు. ఉదయం 5గంటల నుంచి 9గంటల వరకు ఘటాల ఊరేగింపులో గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు, గిరిజనేతరులు, వర్తకులు, పలు రాజకీయ పార్టీల నేతలు, అన్ని వర్గాల భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

- ఆగివున్న లారీని ఢీకొట్టిన కారు
- బంధువులింట పండగ నుంచి విశాఖ వెళ్తూ మార్గమధ్యలో దుర్ఘటన
- మరో పది మందికి గాయాలు



గాయపడిన అప్పలస్వామితో భార్య సత్యరమ్య, పెద్ద కుమార్తె దహన్వీ



చికిత్స పొందుతున్న చిన్నారి తన్విత



గాయాలతో డ్రైవర్ జగదీష్



బాలకృష్ణమోహన్ మృతదేహం

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి పట్టణ పరిధిలో పండగకని చుట్టాలింటికి వెళ్లి, అక్కడి నుంచి విశాఖ బయల్దేరుతా ఆగివున్న లారీని కారు ఢీకొన్న సంఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మరణించాడు. మరో ఐదుగురు గాయపడ్డారు. పట్టణ జాతీయ రహదారి నూకాంబిక ఆర్చి వద్ద ఆదివారం సాయంత్రం ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొంది. స్థానికులు, క్షతగాత్రులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా గనపవరం మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన వై.బాలకృష్ణ మోహన్ సాఫ్‌వేర్ ఉద్యోగి. కృష్ణమోహన్ చెల్లి బొడ్డు సత్యరమ్య, బావ అప్పలస్వామి, మేనకోడళ్లు తనివ్రత, దహన్వీలతో కలిసి తుని తలుపులమ్మలోవలో పండగకు బంధువులింటికి వచ్చారు. సాయంత్రం వరకు లోవలో బంధువులతో సరదాగా గడిపారు. ఎలాగూ దగ్గరకు వచ్చాం కదా.. అని విశాఖలో ఉన్న మరో బంధువు పిన్ని ఇంటికి వెళ్లి చూసొద్దామనుకున్నారు. దీంతో విశాఖలో ఉన్న పిన్నికి కృష్ణమోహన్ ఫోన్ చేసి తామంతా వస్తున్నట్టు తెలిపారు. దీంతో పిన్ని ఆనందంగా వారికి కారు పంపింది. ఆ కారులోనే తలుపులమ్మలోవ నుంచి విశాఖ బయల్దేరారు. మార్గమధ్యంలో అనకాపల్లి జాతీయ రహదారిలో ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చిన కృష్ణమోహన్ కారు బలంగా ఢీకొంది. ఈ ఘటనలో బాలకృష్ణమోహన్ అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్ జగదీష్‌తోపాటు చెల్లి సత్యరమ్య, బావ అప్పలస్వామి, మేనకోడళ్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శ్రీను ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదవార్త తెలుసుకున్న బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సాయంత్రం వరకు తమతో ఆనందగా గడిపిన కృష్ణమోహన్ అకాల మరణంతో ఆ కుటుంబంలో విషాదం అలముకుంది.

మెట్లు దిగుతూ జారి పడి ఎస్‌పీఎఫ్ హెచ్‌సీ మృతి

- అప్పలరాజుపేటలో విషాదం



హనుమంతు సతీష్ బాబు (ఫైల్)

రాజవొమ్మంగి : కాకినాడ పరిధిలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మండలంలోని అప్పలరాజుపేట గ్రామానికి చెందిన హనుమంతు సతీష్‌బాబు (47) కాకినాడలో శనివారం రాత్రి మరణించారు. దీంతో అప్పలరాజుపేటలో విషాదం అలముకొంది. సతీష్‌బాబు నివాసం వుంటున్న అద్దె గృహంలో మేడ మెట్లు దిగుతుండగా కాలుజారి పడిపోయినట్టు బంధువులు తెలిపారు. సతీష్‌బాబు తల వెనుక భాగంలో గాయమై అక్కడిక్కడే మరణించారు. పాఠశాలలకు సెలవలు ఇవ్వడంతో సతీష్‌బాబు భార్య తన ఇద్దరు పిల్లలతో పాటు తల్లిగారి ఊరైన అనకాపల్లి జిల్లా, గొలుగొండ మండలం డొంకాడ గ్రామానికి వెళ్లారు. ఒంటరిగా వున్న సతీష్‌బాబు మేడ ఎక్కి కిందికి దిగుతుండగా అదుపు తప్పి పడిపోయినట్టు కుటుంబీకులు తెలిపారు. మృతి చెంది పడి వున్న సతీష్‌బాబును చూసిన గృహ యజమాని కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం ఆదివారం ఉదయం వెలుగు చూసింది. కాకినాడ -2 టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఏం జరిగింది.. అనే అంశంపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. సతీష్‌బాబు ఎక్కువగా తితిదే వంటి ప్రధాన ఆలయాల్లో సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహించేవారు.

అరచేతిలో తాళపత్ర నిధి

- ఒక్క క్లిక్‌తో సమస్త విజ్ఞానం మన ముందుకు..
- దశాబ్దాల నాటి తాళపత్రాలను డిజిటలైజ్ చేసిన ఏయూ
- జనబాహుళ్యంలోకి భారతీయ పురాతన సంపద

ఏయూ క్యాంపస్: దశాబ్దాల చారిత్రక సంపద అందరికీ అందుబాటులోకి వచ్చింది. తాటాకులపై రాసిన జ్ఞాన సంపదను పరిరక్షించే బాధ్యతను ఆంధ్ర విశ్వవిద్యాలయం సమర్థవంతంగా నిర్వర్తించింది. వర్సిటీ వద్ద దశాబ్దాలుగా భద్రపరిచిన లక్షలాది తాళపత్రాలను డిజిటల్ రూపంలోకి మార్చి చేసి ఇటీవల జన బాహుళ్యంలోకి తీసుకువచ్చింది. కేవలం మన కంప్యూటర్‌లో, స్మార్ట్‌ఫోన్ సహాయంతో ఒక్క క్లిక్‌తో తాళపత్రాలలో ఉన్న సమాచారాన్ని చదివే అవకాశం ఏయూ ఉచితంగా అందిస్తోంది. రండి తాళపత్రాలలో ఏముందో చదివేద్దాం..

2.58 లక్షల తాళపత్రాలు డిజిటల్ రూపం

ఏయూలో ఉన్న 1,170 తాళపత్ర గ్రంథాలలోని 2.58 లక్షల తాళపత్రాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. రూసా పథకంలో భాగంగా రూ.23 లక్షలతో తొలిదశ పనులను పూర్తి చేశారు. ముందుగా తాళపత్రాలను ప్రత్యేకమైన రసాయనాల సహాయంతో శుభ్రపరిచి స్కానింగ్ చేశారు. అనంతరం వాటిని తిరిగి ప్రత్యేకమైన వస్త్రంతో చుట్టి భద్రపరిచారు. తొలిదశలో డిజిటలైజేషన్ చేసిన తాళపత్రాలను ప్రజల అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు చేపట్టారు.

వెబ్‌సైట్‌లో లాగిన్ అయితే చాలు



కంప్యూటర్‌లో సులభంగా చదివే విధంగా తాళపత్రాలు

ఆంధ్ర విశ్వ విద్యాలయం వెబ్‌సైట్‌లో www.andhrauniversity.edu.inకి వెళితే మనకి లైబ్రరీ అనే కాలమ్ కనిపిస్తుంది. దీనిని క్లిక్ చేసి తాళపత్రాలకు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చు. ప్రతి వ్యక్తి ముందుగా తమ ఈ-మెయిల్ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తమ ఈ మెయిల్ ఐడీ సహాయంతో ఒక పాస్‌వర్డ్‌ని రూపొందించుకోవాల్సి ఉంటుంది. మన ఈ మెయిల్, పాస్‌వర్డ్ ఉపయోగించి డిజిటలైజేషన్ చేసిన తాళపత్రాలను ప్రత్యక్షంగా చూడటం, చదవడం చేయవచ్చు.

విభిన్న భాషల్లో తాళపత్రాలు

ప్రస్తుతం డిజిటలైజ్ చేసిన తాళపత్రాలలో తెలుగు, సంస్కృతం, బెంగాలీ, తమిళం, దేవనాగరి తదితర భాషల్లో రాసినవి ఉన్నాయి. ఒక్కో గ్రంథంలో ఎన్ని తాళపత్రాలు ఉన్నాయి, ఒక్కో తాళపత్రం ఎన్ని లైన్లలో రాశారు, ఒక్కో లైన్‌లో ఎన్ని పదాలు ఉన్నాయి అనే సమస్త సమాచారం ఇక్కడ మనకు లభిస్తుంది. వీటిలో ఆయుర్వేదం, జ్యోతిష్యం, పురాణాలు, ఇతిహాసాలు, తర్క, తంత్ర శాస్త్రాలు, ధర్మశాస్త్రం, గద్యకావ్యాలు, అలంకారశాస్త్రం, గణితం, కావ్య, యోగ, వేదాంతం, వేదం, ఉపనిషత్‌లు, ఆగమ శాస్త్రం, శతకాలు, పూజలకు సంబంధించినవి ఉన్నాయి.

అందరూ ఉపయోగించుకోవాలి..

దశాబ్దాల క్రితం రాసినవి కావడంతో వీటిని భద్రపరచడం పెద్ద సవాలుగా నిలిచింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టును నిర్వహించారు. ప్రాచీన విజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో తాళపత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించి, విజయవంతంగా పూర్తి చేశారు. ఇటీవల ఏయూలో జరిగిన సౌత్ ఇండియా విశ్వవిద్యాలయ ఉపకులపతుల సమావేశంలో నాటి రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా దీనిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

పరిశోధకులు, చరిత్రకారులకు ఉపయుక్తంగా..



తాళపత్రాలపై పరిశోధనలు జరిపే వారికి, చరిత్రకారులకు వీటిపై ఆసక్తి ఉంటుంది. అటువంటి వారు ఉపయోగించుకోవాలనే మంచి సంకల్పంతో దీనిని అందరికీ అందుబాటులో ఉంచారు. కేవలం ఈ మెయిల్‌తో రిజిస్ట్రేషన్ చేసుకుని డిజిటలైజ్ చేసిన తాళపత్రాలలో సమాచారాన్ని పూర్తిగా చదివే అవకాశం కల్పిస్తున్నాం.

–ఆచార్య పి.వెంకటేశ్వర్లు, డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయాధికారి

సాక్షి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE
3BHK Flat 1530 Sft + 60 Sft Car parking Area UDS 63 Sqds East Facing 3rd Floor 3 Bedrooms 3 Bathrooms 2 Balcones.. 12 Years Old.. Location : SBI Colony PM Palem. Rs. 55 Lakhs.. More Info Plz Conta.
Ph:92480 23016

Real Estate

FLAT FOR SALE
■ Sale at Kommadi Limited Flats 2 BHK & 3 BHK No Gst & Amenities Charges Sft Rs.4,600/- Only. Cont : 95539 99928, 73965 85713 [V- 626]

HOUSE FOR SALE
■ అచ్యుతాపురం SEZ పూడిమడకరోడ్డు ఫేసింగ్ శ్రీపురం గార్డెన్స్‌లో 167 చ॥గ॥ 2 B/R డీలక్స్ 1400 చ॥గ॥ల్లో అన్ని డెవలప్‌మెంట్స్ పూర్తి చేసుకొని కలదు. ఫోన్: 88229 09999 [V-2782]

RENT / LEASE
■ 2 BHK / 1 BHK - 1000 Sft Group House 1st & 2nd Floor in ASR Nagar Seethammadhara. Cont : 98667 87281 (Pastor Samuel) [V- 794551]

SITE FOR SALE
■ ఆనందపురం మండలం కుసిలివాడలో VMRDA Approved, నార్త్ ఫేస్ లే అవుట్‌ను ఆనుకొని 1645 చ॥గ॥లు సైటు అమ్మకంనకు కలదు. గజం రేటు 8000/-. ఫోన్: 99666 11183 [V-1883]

Services

BUSINESS OFFER
■ ట్రేడింగ్ ద్వారా నెలకు లక్ష రూపాయలు సంపాదించుకొనే అద్భుత అవకాశం. Ph: 7013168624 [H-796783]

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10536]

Wanted

■ రెడీమేడ్ షాపులో పనిచేయుటకు అనుభవం గల సూపర్‌వైజర్స్, సేల్స్ పర్సన్స్ (M/F) కావలెను. పవన్, 5వ లైన్, ద్వారకానగర్, వైజాగ్-16, సంప్ర॥ 94408 02452, 94408 02456. [V-920]

■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటివద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000- 20,000/- వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర॥ 7989951063 [G-786313]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786249]

■ హోటల్ ఫీల్డ్‌లో అనుభవం గల వారు కావలెను. 1) హౌస్ కీపింగ్ కొరకు : శాలరీ : 13,000/- (Inclu. ESI, P.F). 2) సూపర్‌వైజర్స్ : శాలరీ : 18,000/- (Inclu. ESI, P.F), ఉచిత వసతి + భోజనం. 3) సెక్యూరిటీ గార్డ్స్ : 18,000/- డ్యూటీ : 12 గం॥లు. ఫోన్: 91001 03011, 93099 87957 [V-1881]

■ SBI Life లో అడ్వైజర్ / సేల్స్ మేనేజర్‌గా చేయుటకు M/F కావలెను. Qlf : 10th - డిగ్రీ & Govt. & Pvt., Rtd., ఎంప్లాయిస్, బిజినెస్ పర్సన్స్, హౌస్ వైఫ్స్, Ex. సర్వీస్ మెన్స్ సంప్ర. PM : 30k - 50k. ఫోన్ : 90522 16662 [V-1886]

■ Wanted Chief Beuros, Video Editor, Anchors (M/F), News Readers, Script Writers, Camera Men's, Reporters, Crime Reports, Mktg Exe For News Channel. 9951447284, 8247597398 [HA-10780]

■ ప్రముఖ హౌస్‌కీపింగ్ సంస్థలో పనిచేయుటకు బాయ్స్ లోడర్స్, సూపర్‌వైజర్స్, ఫీల్డ్ ఆఫీసర్స్, హెల్పర్స్ కావలెను. కన్సల్టెన్సీ కాదు. At Siripuram. Sly: 15K-25K. Ph: 7995444426, 9989806121 [HA-10776]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. Ph: 9848571888 [H-793424]

■ పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు క్రీమ్ సిటీ నందు పనిచేయడానికి యువకులు కావలెను. జీతం+ఉచిత భోజనం+టిఫిన్+ రూమ్ వసతి కలదు. సంప్ర: Ph: 9490165188 [HA-173]

సినిమా వార్తల కోసం లాగ్‌ఆన్ అవ్వండి www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	9010546644
యలమంచిలి	9951602901
చోడవరం	9010210265
నర్సీపట్నం	9010234557
పాడేరు	9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

'స్థానిక సమస్యలపై అధికారులు దృష్టిపెట్టాలి'



రహదారిపై పారుతున్న మురుగు నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

అనకాపల్లిటౌన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి జీవీఎంసీ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. గాంధీనగరంలో ఆమె ఆదివారం పర్యటించి పలు సమస్యలను గుర్తించారు. స్థానిక మహిళలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గోతులమయంగా మారిన రహదారి, డ్రైనేజీ వ్యవస్థపై ప్రజలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, వార్డు ఇన్‌చార్జి మందపాటి జానకీరామరాజు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నేతలు కొండూరు రవీంద్ర పాల్గొన్నారు.

ఆలయంలో మైక్‌సెట్‌కు రూ.70 వేలు వితరణ



ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు నగదు అందిస్తున్న నరసింహారెడ్డి, లావణ్య దంపతులు

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయానికి మైక్‌సెట్ నిమిత్తం కడపజిల్లా రాజంపేట గ్రామానికి చెందిన మెట్టా నరసింహారెడ్డి, లావణ్య దంపతులు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఆదివారం రూ.70 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు మద్దాల కూర్మారావు, ముత్తా ఈశ్వరరావు, ముత్తా శ్రీనివాసరావు, వాకాడ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రూఫ్‌గార్డెన్‌తో ఇంటికి, శరీరానికి మేలు



సదస్సులో మాట్లాడుతున్న జయచంద్ర

అనకాపల్లిటౌన్ : రూఫ్‌గార్డెన్‌తో ఇంటికి, శరీరానికి మేలు చేకూరుతుందని బయోటెక్నాలజీ శాస్త్రవేత్త కె.జయచంద్ర అన్నారు. పట్టణంలోని గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో గ్రీన్ క్లబ్, గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన రూఫ్ గార్డెనింగ్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉష్ణోగ్రత ప్రభావాలను తగ్గించడంలో రూఫ్‌గార్డెన్ సాగు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇలాంటివి నగరాల్లో నివాసాలకు చలువపందిళ్లు అని, పచ్చని ఆవాసం–ప్రకృతితో సావాసమని పేర్కొన్నారు. రూఫ్‌గార్డెనింగ్‌లో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, జిల్లాకు చెందిన రూఫ్‌గార్డెన్ సంఘ సభ్యులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	:	రాజా
రామబాణం	:	సత్యనారాయణ-1
ఫర్హానా	:	సత్యనారాయణస్క్రీన్-2
కేరళ	:	షిర్డీసాయి
విరూపాక్ష	:	పర్తిసాయి
కథ వెనుక కథ	:	వెంకటేశ్వర
ఉగ్రం	:	శ్రీసత్య
ఏజెంట్	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 119 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-35 యూనిట్లు, ఓ పాజిటివ్-76 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 294 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 228 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

శ్రీరామ దూతం శరణం ప్రపద్యే

'యత్రాస్తి భోగో నహి తత్ర మోక్షః
యత్రాస్తి మోక్షో నహి తత్ర భోగః
శ్రీ మారుతిత్సేవన తత్పరాణాం
భోగశ్చ, మోక్షశ్చ, కరస్త యేవ'

ఎక్కడ భోగం ఉంటుందో అక్కడ మోక్షం ఉండదు. ఎక్కడ మోక్షం ఉంటుందో అక్కడ భోగానికి అవకాశమే లేదు. కానీ మారుతి సేవలో తరించే వారికి భోగం, మోక్షం రెండూ తప్పక లభిస్తాయని శ్రీ రాముడు 'వరం'అను గ్రహించినట్టు పురాణ ప్రతీతి. వైశాఖ బహుళ దశమి పురస్కరించుకుని హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం ఊరూరా రామబంటు హనుమాన్ పూజల్లో భక్తులు మునిగితేలారు.

- ఊరూరా ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



జార్జిక్లబ్ ఆవరణలో హనుమాన్ చిత్రపటానికి పూజలు చేస్తున్న డీఆర్వో వెంకటరమణ



అంజయ్యకాలనీలో అభయాంజనేస్వామిని దర్శించుకుంటున్న 82వ వార్డు కార్పొరేటర్ సునీత దంపతులు



మార్కెట్‌యార్డులో హనుమాన్ యజ్ఞంలో పాల్గొన్న పలకా యశోద, రవి దంపతులు



తాళ్లపాలెం దాసాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



కశింకోట శివాలయం ఆవరణలో ఆంజనేయస్వామి వద్ద పూజలు



శ్రీవీరాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న దాడి రత్నాకర్, కొణతాల నీలిమాభాస్కర్



పంచలోహయంత్రాల పూజలో భక్తులు

అనకాపల్లిటౌన్ : ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని డీఆర్వో వెంకటరమణ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఆదివారం జరిగిన హనుమాన్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వామి, సేవకుల మధ్య బంధానికి రామాంజనేయుల్ని మించిన వారు ప్రపంచ ఇతిహాసాల్లో వేరెక్కడా లేరని కొనియాడారు. స్వామివారిని స్మరించడం ద్వారా శనీశ్వరుడి దృష్టి నుంచి తప్పించుకోవచ్చన్నారు. అంతకు ముందు వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాండ్రేగుల విష్ణుమూర్తితో కలిసి హనుమాన్ చిత్రపటానికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భారత స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షుడు భీశెట్టి దొరమ నాయుడు, క్లబ్ ప్రతినిధులు డి.డి.నాయుడు, బుద్ద కాశీ, పెంటకోట సుబ్రహ్మణ్యం, పోలారపు త్రినాథ్, కోలపర్తి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

- 82వ వార్డు పరిధిలోని అంజయ్యకాలనీ అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి సింధూరం, తమలపాకు పూజలు జరిగాయి. వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీ రామరాజు దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.
- లక్ష్మీదేవిపేట అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా స్వామివారి మూలవిరాట్‌కు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.
- వ్యవసాయ మార్కెట్‌యార్డులో నాగదుర్గమ్మ ఆలయంలో కొలువై ఉన్న ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, రవి దంపతులు హనుమాన్ యజ్ఞం చేశారు.
- అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట గ్రామంలో ఆంజనేయస్వామివారికి టీడీపీ నాయకుడు మళ్ల సురేంద్ర పూజలు చేశారు.
- స్థానిక న్యూకాలనీ అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా స్వామివారికి వెయ్యి తమలపాకులతో సహస్రబిల్వార్చన, సింధూర అర్చన, సామూహిక పంచలోహ యంత్రాల పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు కన్నేపల్లి సూర్యప్రకాశరావు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్: హనుమజ్జయంతిని పురస్కరించుకుని సత్యనారాయణపురం కనకదుర్గమ్మ కొండపై అభయాంజనేయస్వామి విగ్రహానికి అర్చకులు రేజేటి ధర్మాచార్యులు వేద మంత్రాలతో గో క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, ధర్మకర్త బోయిన రమణాజీ, చైర్మన్ మేడిశెట్టి సత్తిబాబు తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

- కొత్తూరు పంచాయతీ డీఎస్పీ కార్యాలయం పక్కనున్న ఆంజనేయస్వామి, శారదానదీ ఒడ్డున ఉన్న వాయుపుత్రుని ఆలయాల్లో ఆదివారం వేకువజాము నుంచే అత్యంత భక్తి శ్రద్ధలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను పూలమాలలు, నిమ్మకాయల దండలు, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణానికి చెందిన ప్రముఖ బంగారు వ్యాపారి, రాష్ట్ర బంగారు వర్తకుల సంఘం కార్యదర్శి కొణతాల రాజేంద్ర కొత్తూరులో అన్నసంతర్పణ నిర్వహించారు.
- మూలపేట గ్రామం ఎన్టీఆర్ కాలనీలో హనుమజ్జయంతి సందర్భంగా నూతనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. దీనికి ఆర్థిక సహాయం అందజేసిన గ్రామ సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి, సత్తిబాబు దంపతులను గ్రామస్తులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయాల్లో హనుమాన్‌చాలీసా పఠించారు. గ్రామాల్లో సాయంత్రం శోభాయాత్రలు జరిగాయి.

తుమ్మపాల : శ్రీ అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పట్టణంలో తోటాడ జంక్షన్ వద్దనున్న వీరాంజనేయ స్వామి జయంతి ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఏర్పాటుచేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయనతో పాటు 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమాభాస్కర్ ప్రారంభించి, భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రత్నాకర్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు కొణతాల శ్రీనివాసరావు, కొణతాల సత్యనారాయణ, కాండ్రేగుల కృష్ణఅప్పారావు, దాడి ఈశ్వరరావు, కర్రి శివుడు దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

కశింకోట : కశింకోటలోని రిక్షా స్టాండ్ వద్దనున్న అభయాంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు, యువ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రేజేటి మారుతిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ సందర్శించి పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

- కస్బావీధిలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు వెయ్యిదశాల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శివాలయంలోని ఆంజనేయ స్వామి వద్ద అర్చకుడు వి.చిదంబరం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు.
- గవరపేట, సలాది వీధి, పూసర్ల వీధి, వడ్డి వీధి, కనకమహాలక్ష్మి వీధి తదితర ప్రాంతాల్లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం నుంచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తమలపాకులు, నిమ్మకాయలతో మాలలు చేసి, స్వామి మెడలో వేసి, అందంగా అలంకరించారు.
- తాళ్లపాలెంలోని చెరువు వద్ద వేంచేసిన దాసాంజనేయస్వామి ఆలయంలో వేకువ జాము నుంచి హనుమజ్జయంతి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ కలగా లక్ష్మితో పాటు, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి సతీష్ తదితరులు దర్శించారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం భజన కార్యక్రమాలతోపాటు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఆలయ ధర్మకర్త చిన్ని చిన్నమ్మనాయుడు, మాజీ మునసబు చిన్ని సన్యాసినాయుడు, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు, వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు చిన్ని రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.
- ఉగ్గినపాలెం, బయ్యవరం, నరసింగబిల్లి, కన్నూరుపాలెం, తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో కూడా హనుమజ్జయంతి సందర్భంగా పూజలు నిర్వహించారు.
- మండలంలోని ఏఎస్ పేటలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, సర్పంచ్ మలసాల ధనమ్మ స్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్ స్వామిని దర్శించుకున్నారు.
- మండలంలోని సోమవరం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.
- చింతలపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం వేకువజాము నుంచే పూజలు నిర్వహించారు. సర్పంచ్ కొట్టె రాము, పాల సంఘం కార్యదర్శి జెర్రిపోతుల నూకినాయుడు తదితరులు పాల్గొన్నారు.



కనకదుర్గమ్మ కొండపై అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఎన్టీఆర్ కాలనీ విగ్రహ ప్రతిష్ఠ చేసిన సర్పంచ్ పలకా సత్తిబాబు దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు



ఏఎస్ పేటలో ఆంజనేయస్వామి సన్నిధిలో విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు



చింతలపాలెం గ్రామంలో పెద్ద ఆంజనేయస్వామి విగ్రహం వద్ద భక్తులు

తాగునీటి ఇక్కట్లకు చెక్



డ్రైనేజీని ఆనుకుని ఉన్న కుళాయి నుంచి నీటిని పట్టుకుంటున్న మహిళలు



నిన్నటి వరకు గవరపేటలో తాగునీటి తిప్పలు



గవరపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన కుళాయి నుంచి నీటి సరఫరా

- కశింకోట మేజర్ పంచాయతీలో పునరుద్ధరణ చర్యలు
- కొత్తగా కుళాయిల ఏర్పాటుతో స్థానికుల ఆనందం

కశింకోట : కశింకోట మేజర్ పంచాయతీ పరిధిలో మంచినీటి సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అవసరమైన చోట అదనంగా కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి త్రాగునీటి కొరతను ఎదుర్కొంటున్న ప్రాంతాల ప్రజలు తమ ఇబ్బందులు తొలగనున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఒత్తిడి లేక.. నీరు రాక..

కశింకోటలో సుమారు 20 వేల జనాభా ఉంది. రెండున్నర లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన భారీ రక్షిత మంచినీటి పథకాలు 3, మరో నాలుగు చిన్న రక్షిత పథకాల ద్వారా త్రాగునీటి సరఫరా జరుగుతోంది. సుమారు 4,500 పబ్లిక్, ప్రైవేట్, ఇంటింటి కుళాయిల ద్వారా నీటిని అందిస్తున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో పైపు లైన్లు అస్తవ్యస్తంగా ఉండటం, భూగర్భ పైప్‌లైన్లు దెబ్బతినడం, నీటి సరఫరాకు అవసరమయ్యే ఒత్తిడి లేకపోవడం తదితర కారణాలతో ప్రజలు తాగునీరు సరిగా అందక, ఇబ్బంది పడుతున్నారు. గవరపేటలోని పెదగుమ్మంవీధి, అల్లవారి వీధి, కనకమహాలక్ష్మివీధి, గోవిందరావు కాలనీ, కళ్లాల దిబ్బ తదితర ప్రాంతాల ప్రజలు భూమిలో గుంతలు తవ్వి, అందులో కుళాయిల్ని పెట్టి, ఆ గోతుల్లో నుంచి పాత్రల్లో నీటిని తోడుకుని పట్టుకుంటున్నారు. కొన్ని చోట్ల ఆ మాత్రం కూడా నీరొచ్చే పరిస్థితి లేక, దూర ప్రాంతాల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్యలపై అధికారులకు విన్నవించుకున్నా ఫలితం కానరాలేదు.

ఎట్టకేలకు చర్యలు

ప్రస్తుత ప్రభుత్వంలో గ్రామాల్లో సైతం తాగునీటి సరఫరాకు పెద్ద పీట వేశారు. జల్ జీవన్ మిషన్ నిధులతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక నిధులు కేటాయించి పైప్‌లైన్లను పునరుద్ధరిస్తున్నారు. దీనిలో భాగంగా గవరపేటలోని పెదగుమ్మం ప్రాంతంలో కొత్తగా పైపులైన్ వేసి అదనపు కుళాయిలు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ఆదివారం నీటి సరఫరాను ప్రారంభించారు. ఐదేళ్ల ఇబ్బందులు తొలగాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కనక మహాలక్ష్మి వీధి, గోవిందరావు కాలనీ, కళ్లాల దిబ్బ, విశ్వ బ్రాహ్మణ వీధి, తదితర ప్రాంతాల్లో కూడా అదనపు కుళాయిలు ఏర్పాటు చేసి నీటి సరఫరాను మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్వహణ లోపాలే కారణం

నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలకు ట్యాప్‌లు మార్చకపోవడంతో, రోడ్లపై నీరు వృధాగా పోయేది. కొన్ని చోట్ల చాలా చిన్న ధార వచ్చేది. మరి కొన్ని ప్రాంతాలు ఎత్తులో ఉండటంతో ఆ స్థాయి ఒత్తిడి లేక, వాల్వ్‌లు సరిగా నిర్వహించక నీరు రాని పరిస్థితి. కస్బా వీధి, కోమటి వీధి, శివాలయం వీధి, పూసర్లవీధి, అగ్రహారం, అఫీషియల్ కాలనీ తదితర కొన్ని వీధుల్లో మాత్రమే నీటి సరఫరా కాస్త మెరుగ్గా ఉంది. గవరపేటలో తాగునీటికి వీధి కుళాయిలే దిక్కు. ప్రస్తుత వేసవి దృష్ట్యా నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో స్థానికుల వినతి మేరకు నీటి సరఫరా పునరుద్ధరణపై అధికారులు దృష్టి సారించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పంచాయతీ పరిధిలో త్రాగునీటి సమస్య నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన చోట పైపులైన్ ఏర్పాటు చేసి వీధి కుళాయిలుల ద్వారా మంచినీటి సరఫరాను మెరుగుపరుస్తున్నాం. నీటి ఎద్దడిని నివారించడానికి పటిష్ట చర్యలు చేపడుతున్నాం. లోతట్టుగా ఉన్న చోట కుళాయిలను పైకి మార్చుతున్నాం. ఈ వేసవిలో నీటి సరఫరాకు ఎలాంటి లోటు ఉండదు.

–ఎస్.రమేష్,
పంచాయతీ కార్యదర్శి, కశింకోట

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి సన్నిధిలో ఎంపీ సత్యవతి దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : మండలంలో జీవీఎంసీ విలీన గ్రామమైన కొత్తూరు నరసింగరావుపేట మోదకొండమ్మ ఆలయంలో అమ్మవారి ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు అమ్మవారిని వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, ఉత్సవ కమిటీ చైర్మన్ అనిల్, వైఎస్సార్‌సీపీ నేతలు ఎ.అప్పారావు, కరణం సురేష్, రమణ, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పరవాడ జెడ్పీ బాలికల పాఠశాల 2002-03 బ్యాచ్ విద్యార్థినులు

పరవాడ: ఇరవై ఏళ్ల క్రితం పరవాడ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో కలిసి చదువుకున్న 2002–03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థినులు ఆదివారం స్టీల్‌ప్లాంట్ ఇందిరా గాంధీ పార్కులో సమావేశమయ్యారు. ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కుటుంబ పరిస్థితులపై ఆరా తీసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి చిలిపి చేష్టలను మరోసారి గుర్తు చేసుకున్నారు. ఆట పాటలతో సందడి చేశారు.

అధ్వానంగా కాలువ



దేశపాత్రునిపాలెంలో పూడుకుపోయిన కాలువ

పరవాడ : దేశపాత్రునిపాలెం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. దేశపాత్రునిపాలెం–జాజులవానిపాలెం గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన మురుగు కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. దుర్వాసనతో రహదారి ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో రోడ్డు పక్క నుంచి ప్రవహిస్తున్న మురుగు కాలువను గుర్తించకుండా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఏరులా పారుతున్న మురుగు కాలువను సీసీ కాలువగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

తుపాను భవనం శిథిలం!



కూలడానికి సిద్ధంగా ఉన్న తుపాను షెల్టర్

పరవాడ: కలపాక శివారు స్వయంభూవరంలోని తుపాను షెల్టర్ శిథిలావస్థకు చేరింది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 40 ఏళ్ల కిందట బాధితుల రక్షణార్థం ప్రభుత్వం తుపాను భవనం నిర్మించింది. అయితే కొంత కాలంగా దీని నిర్వహణ లేకపోవడంతో శిథిల దశకు చేరింది. కూలడానికి సిద్ధంగా ఉన్న ఈ భవనంలో స్థానికులు పశువులు కట్టుకొంటున్నారు. భవనం ఏ సమయంలో కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. భవనాన్ని తొలగించాలని అధికారులను కోరినా వారు పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. కూలడానికి సిద్ధంగా ఉన్న తుపాను భవనాన్ని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com